దళారులకు విక్రయించొద్దు

చిగురుమామిడి: దళారులకు ధాన్యం విక్రయించొద్దని, ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలని తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నర్సయ్య రైతులకు సూచించారు. ఇందుర్తి, బొమ్మనపల్లి, చిగురుమామిడిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. దళారులు పచ్చివడ్లనే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తక్కువ ధరకు విక్రయిస్తే నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రంజిత్‌కుమార్, ఏపీఎం మట్టేల సంపత్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోల హరిణి, సీసీలు, వీఓ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


చిగురుమామిడిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నర్సయ్య, తహసీల్దార్ నరేందర్

అయ్యోరామా.. మాకు తెల్వదాయే..

మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ స్వీకరణ కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభం కాగా కొంత మంది ప్రజలు విషయం తెలియక తహసీల్దార్‌కు సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చారు. పోలీసులు అడ్డుకొని అభ్యంతరం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ అనుమతి లేదని, మూడు తర్వాత రావాలని వెనక్కి పంపించడంతో అయ్యో రామా తెలియక అంతదూరం నుంచి ఇక్కడిదాక రావాల్సి వచ్చిందని వెనుతిరిగారు. – మానకొండూర్


ప్రజలకు నచ్చజెప్పుతున్న పోలీసులు

క్లుప్తంగా

మండల స్థాయి పోటీలు

హుజూరాబాద్‌రూరల్ : మండల స్థాయి పాఠశాల క్రీడా సమైక్య అథ్లెటిక్ పోటీలు 6 నుంచి 7వ తేదీ వరకు జరగనున్నాయని మండల విద్యాధికారి నరసింహారెడ్డి, ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరి సారయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో రావాలని కోరారు. హైస్కూల్ హెచ్‌ఎంలు వ్యాయామ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ఆల్ఫోర్స్ విద్యార్థిని వడ్లూరి వంశిక రాష్ట్ర స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మెన్ వి.నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వంశికను అభినందించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూరలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు.

కిట్స్‌లో వర్క్‌షాపు


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

హుజూరాబాద్‌రూరల్: భవిష్యత్‌లో కంపోజిట్ మెటీరియల్‌కే అధిక ప్రాధాన్యత ఉంటుందని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఐఎస్‌టీఈ ఆధ్వర్యంలో కంపోజిట్ మెటీరియల్స్ మూడో రోజుల వర్క్‌షాపు కార్యక్రమం ఏర్పాటు చేశారు. శిక్షణనుద్దేశించి మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు మెటీరియల్స్ ఎంపిక, తయారీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మెటిరియల్‌కు సంబంధించిన పరిశోధనలు చేసి వ్యాసాలు రాయాలన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ డాక్టర్ ఎంవీ సతీశ్‌కుమార్, అకాడమిక్ ఇన్‌చార్జి మల్లయ్య, కోఆర్డినేటర్ డాక్టర్ యోగేశ్ పుండలిక్ పాల్గొన్నారు.

ఇంగ్లిష్ మెటీరియల్ అందజేత


మెటీరియల్ అందిస్తున్న శ్రీనివాస్‌రావు

శంకరపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు శుక్రవారం ఇంగ్లిష్ మెటీరియల్ అందించారు. హెచ్‌ఎం నీరజ, ఉపాధ్యాయుడిని అభినందించారు. విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

పాఠశాల సందర్శన


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జెడ్పీపాఠశాలను మండల నోడల్ విద్యాధికారి ఆర్. రాజయ్య సందర్శించారు. శుక్రవారం రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న(ఎస్‌ఈఏఎస్) స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో అబ్జర్వేషన్‌లో భాగంగా పాఠశాలను తనిఖీ చేశారు. తొమ్మిది, ఆరో తరగతి విద్యార్థులు ఏ విధంగా ఓఎంఆర్ షీట్‌ను నింపుతున్నారని పరిశీలించారు. పరీక్షా పేపర్లను మండల రిసోర్స్ కేంద్రానికి అప్పగించాలని కోరారు. హెచ్‌ఎం పి. లక్ష్మణ్‌రావు, టీచర్లు రాజమౌళి, శ్యామయ్య, జ్యోత్స్న, శంకరమ్మ, శంకర్, ప్రతిమ, సీఆర్‌పీ వెంకటేశం పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గంగాధర: మండలంలోని కొండన్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని న్యాలకొండపల్లి గ్రామానికి చెందిన నిమ్మనవేని కొమురయ్య ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని శుక్రవారం సర్పంచ్ రేండ్ల జమున, శ్రీనివాస్ పరామర్శించి రూ.ఐదువేలు, యాభై కిలోల బియ్యం అందజేశారు. స్థానిక సర్పంచుతో పాటు సర్పంచులు మేచినేని నవీన్‌రావు, కంకణాల విజయేందర్‌రెడ్డి, వేముల దామోదర్ ఉన్నారు.

విజయవంతం చేయాలి

గన్నేరువరం: కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో 5న జరిగే వికలాంగుల ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా నాయకుడు ఆకుల స్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొనే ఆశీర్వాద సభలో నియోజకవర్గంలోని వికలాంగులు అందరూ పాల్గొనాలని కోరారు.

అందుబాటులో ఉంటూ కష్టపడుతా..

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట: అందుబాటులో ఉంటూ మీ క్షేమం కోసం కష్టపడుతా ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. ఇల్లందకుంట , శ్రీరాములపల్లి, కనగర్తి, లక్ష్మాజిపల్లి, మల్యాల గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఒక్కసారి అవకాశమిస్తే కంటికి రెప్పలా కాపాడుకుంటా, రూ. వెయ్యి కోట్లతో నియోజకవర్గంలో మిగిలిన పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నాయకులు సరిగొమ్ముల వెంకటేశ్, కందాల విక్రమ్, మట్ట వాసుదేవరెడ్డి, రజిత, దరుగుల రమ, రాకేశ్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

ప్రాజెక్టులతో రాష్ట్రం సస్యశ్యామలం

●రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

మానకొండూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో శుక్రవారం సుడా చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్టారావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అనేక ప్రాజెక్టులు కట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని, రాష్ట్రంలో అనేక రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలపై ప్రజలకు నమ్మకం లేదని, నమ్మి ఓటేస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరాకు అవుతుందన్నారు. బ్యాంకుల పేరు మారినందున సాంకేతిక సమస్యతో రుణమాఫీ కొంత ఆలస్యంగా జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌లో సీఎం పదవి కోసం నేతలు ఊహల్లో తేలియాడుతున్నారని, రాష్ట్రంలో బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచులు పృథ్వీరాజ్, రామంచ గోపాల్‌రెడ్డి, ఉండాటి అంజయ్య, బొట్ల కిషన్, ఉపసర్పంచ్ నెల్లి మురళి, నాయకులు గడ్డం నాగరాజు, పిట్టల మధు, ఉండింటి శ్యాంసన్, శాతరాజు యాదగిరి ఉన్నారు.


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

మోసం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ బయలుదేరాయి


ప్రచారంలో సుంకె రవిశంకర్

గంగాధర: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్ పార్టీని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. ఇస్లాంపూర్, కొండయ్యపల్లి, వెంకటాయిపల్లి గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రాంతాల నుంచి వచ్చేవారిని నమ్మొద్దని స్థానికుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బయలుదేరారని వారిని నమ్మవద్దన్నారు. నిరంతర విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు అందిస్తున్న బీఆర్‌ఎస్‌ను ఆదరించాలన్నారు. మూడోరి అధికారంలోకి రాగానే బీఆర్‌ఎస్ మేనిఫెస్టో అమలుచేస్తామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా, గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు చేయనంత అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. ప్రచారంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


రామడుగు: మండలంలోని గుండి, రామడుగు, వెంకట్రావుపల్లి, లక్ష్మీపూర్, మోతె, కొరటపల్లి, గోలిరామయ్యపల్లి, గోపాల్‌రావుపేట గ్రామాల్లో శుక్రవారం సుంకె రవిశంకర్‌కు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మెన్ ఒంటెల మురళిక్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, కలిగేటి లక్ష్మణ్, చాడ శేఖర్‌రెడ్డి, గుండి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మానకొండూర్: మండలంలోని కొండపల్కలలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టే పథకాల గూర్చి వివరించారు. మూడోసారి రసమయి బాలకిషన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్వీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌గౌడ్, మండల ఇన్‌చార్జి దండబోయిన శేఖర్, పిండి సందీప్, కొట్టె ప్రసాద్‌రావు, పోగాగుల రవీందర్, బాషవేని కొమురయ్య, అశోక్ పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

సైదాపూర్: నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తా, మరోసారి ఆశీర్వదించాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ కోరారు. రాయికల్, ఘనపూర్, రాయికల్ తండా, ఆకునూర్, గొల్లగూడెం, పెర్కపల్లి, సర్వాయిపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే రైతు బంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ సాధ్యమని వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఈ ప్రాంతంపై అవగాహన లేదని, బీజేపీ అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తెలియదని, ఇలాంటి పార్టీలకు ఓటు వేయొద్దన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మండల అధ్యక్షుడు రాజయ్య, ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మన్లు తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి పథకాలే గెలిపిస్తాయి


మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీతారెడ్డి

చిగురుమామిడి: సంక్షేమం, అభివృద్ధి పథకాలే హుస్నాబాద్ ఎమ్మెల్యేగా మూడోసారి వొడితెల సతీశ్‌కుమార్‌ను గెలిపిస్తాయని ఎంపీపీ కొత్త వినీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నవాబుపేట్, గాగిరెడ్డిపల్లి, లంబాడిపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని జెడ్పీటీసీ గీకురు రవీందర్ తెలిపారు. సమావేశంలో మండలఅధ్యక్షుడు అంజయ్య, మాజీ ఎంపీపీ సుజాత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, రైతు బంధు జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య, రైతు సమన్వయసమితి మండల అధ్యక్షుడు తిరుపతి, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, రామోజు కృష్ణమాచారి, మండల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మానికి ఓటెయ్యండి


బేతిగల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జమున

వీణవంక: ధర్మం, న్యాయానికి ఓటెయ్యాలని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమున కోరారు. బేతిగల్, కనపర్తి, నర్సింగాపూర్, వల్భాపూర్ గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఉద్యమం నుంచి నా భర్త ఎన్నో ఉద్యమాలు చేశాడని, ఇప్పటి వరకు ఏడుసార్లు అవకాశం ఇచ్చారు మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాళ్లు ఊళ్ల మీద పడ్డారు, న్యాయం, ధర్మం వైపు నడుస్తున్న రాజేందర్‌కు ఓటేయ్యాయలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రబెల్లి సంపత్‌రావు, నరేడ్ల శ్రీనివాస్, గొట్టిముక్కుల సంపత్‌రావు, మోరే స్వామి, చొప్పరి సారయ్య, పర్లపల్లి స్వామి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, సిలివేరు గణపతి, జీడిపెల్లి రాజేశ్వర్‌రావు, ఎండీ అఖిల్ పాషా, ఎండీ మతిన్, మండల పార్టీ అధ్యక్షులు రామిడి ఆదిరెడ్డి, బత్తిని నరేశ్‌గౌడ్, దాగు అశోక్‌రెడ్డి, బొబ్బల కరుణాకర్‌రెడ్డి, ఉన్నారు.

పదేళ్లలో ధరలు తగ్గించలేదు


ప్రచారం చేస్తున్న ఆరెపల్లి మోహన్

శంకరపట్నం: పదేళ్లు అధికారంలో ఉండి తగ్గించని గ్యాస్ ధరలను తిరిగి అధికారంలోకి వచ్చాక రూ.500 సిలిండర్ అందిస్తామని బీఆర్‌ఎస్ అబద్ధం మాట్లాడుతుందని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెపల్లి మోహన్ అన్నారు. శుక్రవారం అర్కండ్ల, ఎరడపల్లి, తాడికల్ గ్రామాలలో పర్యటించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్పా రసమయి బాలకిషన్ చేసిందేమిలేదన్నారు. ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ తప్పుడు వాగ్దానాలు చేస్తుందని ఆరోపించారు. బీజేపీకి ఓటువేసి గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రాములు, కొమురయ్య. సమ్మిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

బహుజనులు బాగుకోసం బీఎస్పీని గెలిపించండి


మాట్లాడుతున్న పల్లె ప్రశాంత్‌గౌడ్

ఇల్లందకుంట: బహుజనులు బాగుపడాలంటే బహుజన సమాజ్ పార్టీకి ఓటేసి గెలిపించాలని బీఎస్పీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె ప్రశాంత్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. బహుజనుల బతుకులు బాగు కోసం ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, జిల్లా, నియోజకవర్గ ఇన్‌చార్జీలు రవీందర్, మొగిలయ్య, రామస్వామి పాల్గొన్నారు.

●శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లో లంక దిలీప్ సాగు చేస్తున్న వరి వంగడాలను, వ్యవసాయ క్షేత్రాన్ని ఏరువాక కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం రూపొందించిన వంగడాల్లో సన్నగింజ రకాలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. అధిక దిగుబడి ఇచ్చేవంగడాలను రైతులు ఉపయోగించాలని కోరారు. నూతన వంగడాలను ప్రోత్సహించాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ సీనియర్ సైంటిస్టు డాక్టర్ సతీశ్‌చంద్ర, పొలాస సీనియర్ సైంటిస్టు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గొన్య నాయక్, కూనారం సీనియర్ సైంటిస్టు డాక్టర్ శ్రీధర్ సిద్ధి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె. మదన్ మోహన్ రెడ్డి, డాక్టర్ ఎం రాజేందర్ ప్రసాద్, ఏవో వంశీక్రిష్ణ పాల్గొన్నారు.

●ఇంటి పన్నులు వసూలు చేయాలి

శంకరపట్నం: ఇంటిపన్నులు నవంబర్ 10లోపు వందశాతం వసూల్ చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. శుక్రవారం శంకరపట్నం, సైదాపూర్, వీణవంక మండలాల్లోని గ్రామాల పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా అధికారులు నడుచుకోవాలన్నారు. ఈసమావేశంలో అధికారులు లత, శ్రీవాణి, బషీర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

●ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

శంకరపట్నం: కొనుగోలు కేంద్రాలను వెంటనే పారంభించాలని సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య సంబంధిత అధికారులను కోరారు. తాడికల్‌లో ధాన్యం కుప్పలను శుక్రవారం పరిశీలించారు. 25 రోజులుగా ధాన్యం కుప్పలుగాపోసి నిరీక్షిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు.

●ముగిసిన అభిలాశ్ అంత్యక్రియలు

గన్నేరువరం: కుటుంబ కలహాలతో మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన సందవేని అభిలాశ్ అలియాస్ చింటూ బుధవారం రాత్రి తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం పోలీసులు గజ ఈతగాల్లతో రోజంతా గాలింపు చేపట్టారు. శుక్రవారం అభిలాశ్ మృతదేహం నీటిపైకి రావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంత్యక్రియలకు కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు, స్నేహితులు భారీగా తరలించారు.

ఏర్పాట్లు పరిశీలన

చొప్పదండి: చొప్పదండి అసెంబ్లీ రిటర్నింగ్ కార్యాలయాన్ని సీపీ అభిషేక్ మహంతి శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. కార్యాలయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి కార్యాలయంలో కలియతిరిగారు. నామినేషన్‌కు వచ్చే వారిలో అయిగురికి మాత్రమే అనుమతి ఇస్తామని తెలిపారు. అనంతరం చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలను, అనంతరం ఆర్నకొండ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, సీఐ రవీందర్, ఎస్‌ఐలు ఉపేంద్రచారి, అభిలాష్ ఉన్నారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

జమ్మికుంట: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పట్టణ సీఐ బార్పటి రమేష్ పిలుపు నిచ్చారు. ఎన్నికల నియమావళిలో భాగంగా విలాసాగర్ గ్రామంలో పట్టణ సీఐ బార్పటి రమేష్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్,ఏఎస్‌ఐ రాధకృష్ణ, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో కరీంనగర్ సీపీ ఆదేశం మేరకు హుజూరాబాద్‌రూరల్ సీఐ సంతోష్, సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లు, వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామస్తులు సహకరించాలని గ్రామస్తులను కోరారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో చొప్పదండి సీఐ రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు కమ్యూనిటీ ప్రొగ్రాంలో భాగంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ గురించి వివరించారు. శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. అనంతరం బీఎస్‌ఎఫ్ కమాండోలు ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ ఉపేంద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటేయాలి

తిమ్మాపూర్: మండలంలో మొగిలిపాలెంలో ఎల్‌ఎండీ పోలీసులు శుక్రవారం సాయంత్రం కమ్యునిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎల్‌ఎండీ, గన్నేరువరం, చిగురుమామిడి ఎస్సైలు ప్రమోద్‌రెడ్డి, నర్సింహారావు, రాజేశ్ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని పోలీసులు, అదనపు బలగాలు మొగిలిపాలెంలో తనిఖీ నిర్వహించారు. సమస్యాత్మక గ్రామంగా గుర్తించడంతో పోలీసులు తగు చర్యలు చేపట్టారు. తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... ఓటర్లు ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు

తిమ్మాపూర్: అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఇంద్రప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని మన్నెంపల్లి శివారులో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై మద్యం తరలిస్తూ పట్టుపడ్డాడు.

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇద్దరి ఇళ్లలో రూ.51వేల విలువ చేసే మద్యం పట్టుకున్నారు.

ఎంపీ బండి సంజయ్ వాహనం తనిఖీ

హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారు పర్కాల్ క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు.

చేరికలు, నియామకం

జమ్మికుంట: మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, పట్టణానికి చెందిన తుమ్మేటి సమ్మిరెడ్డి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ భట్టి విక్రమార్కను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సూచించారని తెలిపారు. చేరికకు సహకరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, జిల్లా నాయకులు, హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపు కోసం దర్గాలో ప్రార్థనలు

మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాలో హుజూరాబాద్ పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల ప్రణవ్ గెలుపు కోసం శుక్రవారంప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం, మైనారిటీ నాయకులు అలీం, నవాబ్, సలీం, తౌసిప్, రఫిక్, సల్మాన్, పర్మాన్, రియాజ్, రఫీ, అన్ను, సాధిక్, చాంద్, నవాబ్ పాషా, జియా, సిరాజ్, ముఖిద్, హది పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని పచ్చునూర్‌కు చెందిన వైస్ ఎంపీపీ గోపు మధుసూదన్‌రెడ్డి, గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఆకుల నర్సింగరావు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు.

చొప్పదండి: మండలంలోని మంగళపల్లి ఉపసర్పంచ్ పెద్దెల్లి సురేశ్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. సురేశ్‌తో పాటు ఆయన అనుచరులకు కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. చేరిన వారిలో రాజు, రాజనర్సయ్య, మల్లయ్య, లచ్చయ్య, నర్సయ్య ఉన్నారు. మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ ఇన్‌చార్జిగా ఇమ్రాన్

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జిగా ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్‌ను నియమిస్తూ జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వై థామస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ ఎంపీ ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌కు ఇమ్రాన్ కృతజ్ఞతలు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామ్‌రెడ్డి

రామడుగు: రామడుగు మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దత్తోజీపల్లి గ్రామానికి చెందిన పల్లె రామ్‌రెడ్డిని నియామకం చేస్తూ శుక్రవారం యూత్ కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు ముత్యం శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం, ముత్యం శంకర్ అందజేశారు.

తల్లిదండ్రుల ప్రచారం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లిలో కాంగ్రెస్‌పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ తండ్రి శ్రీనివాస్‌రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తల్లి పద్మశ్రీ బోర్నపల్లి లో గడపగడపకు తిరుగుతూ ప్రచారం చేశారు.

వైఎస్సార్‌టీపీకి రాజీనామా

గన్నేరువరం: వైఎస్సార్‌టీపీకి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ నాయకుడు, మాదాపూర్‌కు చెందిన సంపతి ఉదయ్ శుక్రవారం తెలిపారు. తనతో పాటు మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేశ్, రాజేందర్‌రెడ్డి, సదానందం, షఫీ, షకిల్, రాజేశ్ రాజీనామా చేస్తారని, ఎన్నికల పోటీకి దూరంగా ఉంటున్నట్లు అధినాయకురాలు నిర్ణయం తీసుకోవడం నిరాశపరిచిందని పేర్కొన్నారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సు సర్వీసు

హుజూరాబాద్‌రూరల్: అయ్యప్ప భక్తుల కోసం శబరిమలకు టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ పి.అర్పిత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. బస్సు అద్దెకు తీసుకునే గురుస్వామికి ఇద్దరు మణికంఠ స్వాములకు, ఇద్దరు వంట మనుషులతో పాటు మరో సహాయకుడికి ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 7382848449 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి చేయాలి

హుజూరాబాద్: అవినీతి రహిత సమాజానికి ప్రతి పౌరుడు కృషి చేయాలని హుజూరాబాద్ పోస్ట్‌మాస్టర్ యు.మహేందర్ కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5వ తేదీ వరకు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో నిఘా అవగాహన వారోత్సవాలు ఏర్పాటులో భాగంగా శుక్రవారం హుజూరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు, వినియోగదారులకు ప్రజా ప్రయోజనాల వెల్లడి, సమాచారం ఇచ్చే వారి రక్షణ తీర్మానం-2004పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పౌర సేవలపై నిర్లక్ష్యం, అవినీతికి పాల్పడే వ్యక్తులపై కేంద్ర నిఘా సంస్థకు ఫిర్యాదు చేయాలని కోరారు. అవినీతి రహిత సమాజం కోసం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యోగులు వేణుగోపాల్, సందీప్, రఫీ, శ్రీనివాస్, అనిల్, సంపత్, హరీశ్, సత్యం, శ్యామ్, స్వామి, సతీశ్, రాజు, రాము , అనిల్, అనూష, రాజేశ్, శివాజీ, వినియోగ దారులు పాల్గొన్నారు.